పరిష్కారం చూపండి సారూ..

• జిల్లా కేంద్రానికి పోటెత్తిన ప్రజలు
• కలెక్టర్‌కు వినతుల సమర్పణ

'మండల కేంద్రాల్లో తమను పట్టించుకోవడం లేదు.. ఇక్కడైనా మాకు తగిన పరిష్కారం చూపండి సారూ' అంటూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి వారి సమస్యలను విన్నవించుకున్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజలు పోటెత్తారు. కలెక్టర్ ఆనంద్‌కు వివిధ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

– నెల్లూరు రూరల్


కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న మహిళలు

అవసరమైన మేరకు భూమి తీసుకోండి


మాట్లాడుతున్న గ్రామస్తులు

విడవలూరు గ్రామం మీదుగా బుచ్చిరెడ్డిపాళెం నుంచి ఊటుకూరు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు మంజూరైందని, అయితే అవసరమైన మేరకే రోడ్డుకు ఇరువైపులా భూమి తీసుకోవాలని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా పంచాయతీ సర్వేలో మార్కింగ్ ఇచ్చి ఉన్నారని, దీనిని తాము అంగీకరించలేదన్నారు. దీనివల్ల 250 కుటుంబాలకు తీవ్రనష్టం కలుగుతుందని, మళ్లీ రీసర్వే నిర్వహించి అవసరమైన మేరకు రోడ్డుకు ఇరువైపులా భూమి తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి



ధర్నా చేస్తున్న దళిత నేతలు

పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించారని, ఇది భారత రాజ్యాంగానికి జరిగిన అవమానమని దళిత సంఘర్షణ సమితి అధ్యక్షుడు మల్లి అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి వినతిపత్రం సమర్పించారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దళిత నేతలు శ్రీనివాసులు, హరి, పెంచలయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతులివ్వాలి

ఇందుకూరుపేట మండలంలో జర్నలిస్టుగా విశేష సేవలందించిన చక్రపాణి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయాలంటూ మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. తొలుత కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. డేవిస్‌పేట పంచాయతీ యాగర్ల సెంటర్‌లో విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

గడువులోగా పరిష్కరించాలి


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్

నెల్లూరు(బారకాసు) : ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు ఆదేశించారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని పబ్లిక్ పార్కులు అన్యాక్రాంతం కాకుండా అధికారులు, సచివాలయ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అర్జీల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రజల నుంచి 26 ఫిర్యాదులు అందాయని, వాటిలో ఆప్కాస్ విభాగానికి 2, ఇంజినీరింగ్‌కు 4, హౌసింగ్‌కు 6, హెచ్ సెక్షన్‌కు 2, పబ్లిక్‌హెల్త్‌కు 2, టౌన్ ప్లానింగ్‌కు 9, రెవెన్యూ విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందుకున్నామని తెలిపారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, ఈఈ రహంతూ జానీ, శేషగిరిరావు, సీపీ హిమబిందు, మేనేజర్ ఇనాయతుల్లా పాల్గొన్నారు.

రత్నంలో రైతు దినోత్సవం


సన్మానం అందుకున్న రైతులతో విద్యార్థులు

నెల్లూరు (టౌన్) : స్థానిక సరస్వతీనగర్‌లోని రత్నం స్కూల్‌లో రైతు దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులు రైతుల్లా పొలం పనులు చేశారు. అనంతరం పలువురు రైతులను సత్కరించారు. జీఎం రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపల్ మణిమాల, ప్రపూర్ణ పాల్గొన్నారు.

62 మందికి ఉద్యోగాలు

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో, ప్రభుత్వ బాలుర ఐటీఐలో సోమవారం జాబ్‌మేళాలు జరిగాయి. ఫ్లిప్‌కార్ట్, బ్లూస్టార్, అపోలో ఫార్మసీ, క్రిస్ ఫైనాన్స్, డైకిన్, పానాసోనిక్, లైఫ్ సొల్యూషన్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, అమరరాజా బ్యాటరీస్, భార్గవి ఆటోమొబైల్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల అనంతరం డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్‌మేళాలో 39 మంది, ఐటీఐలో జరిగిన జాబ్‌మేళాలో 23 మంది ఎంపికయ్యారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఎస్‌డీఓ అబ్దుల్‌ఖయ్యూం, ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ గిరి, స్కిల్ హబ్ ఇన్‌చార్జిలు ఉమాసుమాలిని, శ్రీధర్, హేమంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్) : ఆస్థాన ఏ యూసుఫియ అనంతసాగరం పీఠాధిపతి సయ్యద్ నజీర్ సాహెబ్ ఆధ్వర్యంలో సంస్థకు చెందిన 2025 క్యాలెండర్‌ను రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. నగరంలోని అజీజ్ నివాసంలో వీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆవాజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ అన్సర్, టీడీపీ నేత ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

నేత్రదానం


మృతురాలి కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్ అందజేత

నెల్లూరు(అర్బన్) : నగరంలోని మూలాపేటలో నివాసం ఉంటున్న చేంజ్ వనాంబాల్(90) అనే మహిళ వృద్ధాప్యంతో సోమవారం మృతిచెందారు. సింహపురి దేహ సమర్పణ సంస్థ వారు మృతురాలి కుటుంబ సభ్యులను సంప్రదించి నేత్రదానంపై అవగాహన కల్పించగా వారు నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి మోటివేటర్ అనిల్ నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా దేహ సమర్పణ సంస్థ కన్వీనర్ వి.విజయ మృతురాలి కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు.

అభినందన


అనుబంధ విభాగాల అధ్యక్షులను సత్కరించిన విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీసునంద, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పోతురాజు చంద్రశేఖర్, అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు లావణ్యలు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని విజయకుమార్‌రెడ్డి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

నెల్లూరు(బారకాసు) : 14వ డివిజన్‌లో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నామని స్థానిక కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన సచివాలయ శానిటరీ సెక్రటరీలు కావ్య, వర్షిత రాణి, మేస్త్రీలతో కలిసి పద్మావతినగర్, వేపదొరువు తదితర ప్రాంతాల్లోని ఖాళీ ప్లాట్లలో నీరు నిల్వ ఉన్న చోట, మురుగు గుంతల్లో ఆయిల్ బాల్స్ వదిలారు.


హ్యాండ్స్ ఆన్ ఫౌండేషన్‌కు పురస్కారం

నెల్లూరు సిటీ : మాగుంట లేఅవుట్‌లోని ఎక్సోటికలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నెల్లూరు బ్రాంచ్ వారు హ్యాండ్స్ ఆన్ ఫౌండేషన్ చేస్తున్న సేవలకు సోమవారం పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఐడీఏ నెల్లూరు బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, మాజీ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగరంలో కార్గో డోర్ డెలివరీ సేవలు

నెల్లూరు సిటీ : ఆర్టీసీ కార్గో విభాగం ద్వారా నగరంలో డోర్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి అన్నారు. నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో సేవలపై కరపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ–2 డిపో మేనేజర్ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రవీంద్రభారతి విద్యార్థుల ప్రతిభ



నెల్లూరు (టౌన్) : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారని జోనల్ ఇన్‌చార్జి శ్రీహరి తెలిపారు. స్థానిక నవాబుపేటలోని రవీంద్రభారతి స్కూల్‌లో పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయబ్‌రసూల్, కుష్వంత్, పునీత్, గిరిధర్‌లకు బంగారు పతకాలు, సంజయ్, గ్రేసన్‌లు కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ నిరుపమ, అకడమిక్ ఇన్‌చార్జి రేష్మా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అర్జీలపై ప్రత్యేక ఆడిట్ టీమ్

నెల్లూరురూరల్ : రెవెన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలపై రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక ఆడిట్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లుగా జేసీ కార్తీక్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాల్లో సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో జేసీ సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని, అలాగే రెవెన్యూ సదస్సుల గురించి ముందస్తు సమాచారం గ్రామీణ ప్రజలకు తెలియజేయాలన్నారు. హౌసింగ్‌లో స్టేజ్ కన్వర్షన్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జనవరి తొలి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇళ్ల ప్రారంభోత్సవం చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి తగినట్లు అధికారులు పని చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యారమ, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, డీఈఓ బాలాజీరావు, డీసీఓ గురప్ప, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈలు వెంకటరమణ, విజయన్, జిల్లా హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న జేసీ కార్తీక్

జెనెక్స్ బీ స్కూల్లో జాబ్‌మేళా

నెల్లూరు (టౌన్) : స్థానిక పార్థసారథి నగర్‌లోని జెనెక్స్ బీ స్కూల్‌లో సోమవారం జాబ్‌మేళాను నిర్వహించినట్లు విద్యాసంస్థల చైర్మన్ వెంగళరెడ్డి, డైరెక్టర్ కొండలరావు తెలిపారు. చెన్నైకు చెందిన ఆక్యులే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మేళాను నిర్వహించారన్నారు. బీకామ్, బీబీఏ, ఎంబీఏల్లో 80 శాతం మార్కులు సాధించిన 87 మంది విద్యార్థులు పాల్గొనగా రాత పరీక్ష, ఇంటర్వ్యూలు అనంతరం 15 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు శ్రీలేఖ, జయప్రద, పీజీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీతేజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిల్, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీచరణ్ పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(అర్బన్) : నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత శుక్రవారం రాత్రి కలెక్టర్ ఆనంద్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. అలాగే దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

• నెల్లూరు (టౌన్) : సమగ్రశిక్ష ఏపీసీగా బాధ్యతలు చేపట్టిన వెంకటసుబ్బయ్య సోమవారం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

క్రిస్మస్‌కు కళా స్వాగతం



నెల్లూరు(బృందావనం) : మూలాపేటకు చెందిన సూక్ష్మకళాకారుడు గంధవళ్ల ఉమాశంకర్ క్రైస్తవ సంఘీయులకు సోమవారం కళాత్మకంగా శుభాకాంక్షలు తెలిపారు. పుచ్చకాయపై జీసస్ చిత్రాన్ని తీర్చిదిద్ది క్రిస్మస్‌కు స్వాగతం పలికారు.

అయ్యప్పస్వామికి పూజలు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారికి హోమాలు, సహస్ర కలశాభిషేకం, పాలాభిషేకం, మహాగణపతి హోమం, శీవేలి ఉత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు, భిక్ష స్వీకరించారు. ఉభయకర్తలుగా పులి పుల్లయ్యయాదవ్– రాయణమ్మ, రాచర్ల రవికుమార్– బుజ్జమ్మ, కత్తుల విజయకుమార్– సుధావాణి, కె.హర్షవర్ధన్– లక్ష్మీమనోజ్ఞ దంపతులు వ్యవహరించారు. పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, పావళ్ల ప్రసాద్ పర్యవేక్షించారు.

జోనల్ చైర్మన్ తనిఖీలు

నెల్లూరు సిటీ: నగరంలోని ఆత్మకూరు బస్టాండ్‌లో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. ఎమ్మార్పీకే తినుబండారాలు విక్రయాలు చేయాలని సూచించారు. డిపో మేనేజర్ శివ కేశవ్‌యాదవ్, బీజేపీ నేతలు సునీల్ సుబ్బరాజు ప్రవీణ్‌కుమార్, చైతు బండారు, సురేష్ నాయుడు పాల్గొన్నారు.

ఐక్యతగా జీవించడమే క్రిస్మస్

• కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్ : ప్రతిఒక్కరూ ఐక్యత, ప్రేమ, దయతో నిజాయతీగా జీవించడమే క్రీస్తు బోధనల సారాంశమని కలెక్టర్ ఆనంద్ అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై, మాట్లాడారు. భారతదేశంలో క్రైస్తవ మతానికి రెండు వేల సంవత్సరాలకుపైగా ఘన చరిత్ర ఉందన్నారు. బిషప్ మోస్ట్ రెవరెండ్ ఎండీ ప్రకాశం, మేయర్ స్రవంతితో కలిసి కలెక్టర్ తొలుత క్రిస్మస్ ట్రీని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పేదలకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎం.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రఘు, పాస్టర్లు దయాసాగర్, ఎలిషాకుమార్, సురేంద్రబాబు, శోభన్‌బాబు, క్రాంతికుమార్, ప్రభుకుమార్, బర్నబాస్, పాల్‌కోటి, కేఎస్ రాజు, హనోక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రీ క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్, బిషప్, మేయర్

కిమ్స్‌లో..

నెల్లూరు(అర్బన్) : స్థానిక దర్గామిట్టలోని కిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రీ క్రిస్మస్ వేడుకలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. శాంతాక్లాజ్ వేషధారణలో బహుమతులు అందజేశారు. డాక్టర్లు, టెక్నీషియన్లు, సిబ్బంది పలు రకాల స్కిట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అనంతరం ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు మాట్లాడుతూ ప్రతి నిత్యం పనిఒత్తిడితో ఉండే డాక్టర్లు, సిబ్బందికి ఇలాంటి కార్యక్రమాలు ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డీజీఎం శివమాల, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్లో..

నెల్లూరు (టౌన్) : స్థానిక కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పేద విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషారాణి, పాస్టర్ హనాక్, హెచ్‌ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వరరావు, పాస్టర్ హనోక్, డేవిడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కిమ్స్ ఆస్పత్రిలో..


మున్సిపల్ పాఠశాలలో..

క్రిస్మస్ కాంతులు

• విద్యుద్దీపకాంతులతో ప్రార్థనా మందిరాలు
• నేటి అర్ధరాత్రి నుంచే వేడుకలు
• సింహపురిలో సందడి

నెల్లూరు(బృందావనం): పాపులను రక్షించేందుకు యెహోవా బాల ఏసుగా జన్మించే చారిత్రాత్మక వేడుకను ఘనంగా జరుపుకునేందుకు నెల్లూరు ముస్తాబైంది. ఇప్పటికే నగరంలోని ప్రధాన చర్చిలు విద్యుద్దీపకాంతులతో ముస్తాబైంది. మంగళవారం అర్ధరాత్రి నుంచే వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశారు.

ముందురోజు నుంచే..

క్రిస్మస్ పండగను ఆచరించడంలో భాగంగా క్రైస్తవులు ముందస్తు క్రిస్మస్ వేడుకలను మొదలుపెడతారు. ఇళ్లకు వెళ్లి క్యారల్స్ నిర్వహించడం, సండే స్కూల్ చిన్నారుల నాటికలు, స్కిట్లతో పాటు గాన జయంతి, గానలహరులు, ఆయా కార్యాలయాల్లో క్రిస్మస్ సంబరాలు నిర్వహించడం పరిపాటి. 24వ తేదీ రాత్రి నుంచే జిల్లాలోని అన్ని క్రైస్తవ సంఘాల్లో ప్రత్యేక ఆరాధనలు ప్రారంభమవుతాయి. గాన, ప్రతిగానాలు, సంగీత ప్రాధాన్యత కలిగిన ఆరాధనలు చేస్తూ క్రైస్తవులు వారికే కాకుండా తమ చుట్టుపక్కల ఉన్నవారికి కానుకలు ఇవ్వడం, శుభాకాంక్షలు తెలపడం చేస్తారు. ''నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించు'' అని ఏసుక్రీస్తు ఇచ్చిన ఆజ్ఞను పాటిస్తారు. ప్రపంచంలో శాంతిని ప్రసాదించే ఏసుక్రీస్తు బోధనలు నేటికీ అవసరం ఉంది.


విద్యుద్దీపకాంతులతో వీఆర్సీ సెంటర్‌లోని బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్


బట్వాడిపాళెం సెంటర్‌లోని సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చి


మూలాపేటలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి

అందరికీ రక్షణ



ఏసుక్రీస్తు మానవరూపం దాల్చి మనిషిగా జన్మించి పాపులను రక్షించిన విధానం అందరికీ పండగే. నశించిపోతున్న వారిని వెదికి రక్షించే ఏసుక్రీస్తు బోధనలు అనుసరించే వారు ఎవరైనా నిత్యం శాంతి సమాధానాలతో ఆనందంగా ఉంటారు.

– రెవరెండ్ కంది శ్యామ్‌సన్ కుమార్, పాస్టర్, బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్, నెల్లూరు

సర్వమానవాళికి పండగ



ప్రాంతాలకు, వర్గాలకు అతీతంగా క్రిస్మస్ అందరి పండగ. పాపరహితుడు పాపులను రక్షించడానికి ఈ లోకానికి వచ్చాడు. ఆయన ప్రేమించే దేవుడు. నీ జీవితంతో అవసరం లేకుండా నిన్ను ఆశీర్వదించే దేవుడు. ఆయన ప్రేమ ప్రతి మనిషిని ఆనందంగా ఉండేలా చేస్తుంది.

– రెవరెండ్ రాజశేఖర్ దాసరి, పాస్టర్, యునైటెడ్ గుడ్‌న్యూస్ బాప్టిస్ట్ చర్చి, నెల్లూరు

అవగాహనతోనే నియంత్రణ

నెల్లూరు(క్రైమ్) : చట్టాలు, నేర నియంత్రణ చర్యలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు, నేరాలను కట్టడి చేయవచ్చని భావించిన ఎస్పీ కృష్ణకాంత్ వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రతి సోమవారం కలెక్టరేట్, ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాలులో జరిగే పీజీఆర్‌ఎస్(ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక)కు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో బాధితులు వస్తుండటంతో వారికి దృశ్య రూపంలో అవగాహన కల్పించేందుకు పూనుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధారణ, సీటుబెల్టు వినియోగం, సైబర్ క్రైమ్, గుడ్‌టచ్–బ్యాడ్‌టచ్, మహిళల రక్షణ చట్టాలు, మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై వీడియోలను రూపొందించి కలెక్టరేట్, ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాలు వద్ద ప్రొజెక్టర్‌లను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు.


కలెక్టరేట్‌లో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విద్యుత్ బకాయిలపై దృష్టి పెట్టాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్ బకాయిల వసూళ్లపై అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి తెలిపారు. నగరంలోని కోటమిట్టలో ఉన్న విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో సోమవారం డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, ప్రతినెలా వచ్చే డీసీలిస్ట్‌ను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, 33 కేవీ విద్యుత్ లైన్లను నిరంతరం పెట్రోలింగ్ చేస్తూ లోపాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి విద్యుత్ బిల్లింగ్‌ను ఐఆర్‌డీఏ స్కానింగ్ ద్వారా మాత్రమే తీయాలని తెలియజేశారు. అనంతరం రెవెన్యూ బకాయిలను వసూలు చేయడంలో ప్రతిభ చూపిన టౌన్‌హాల్ సెక్షన్ ఏఈ, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అశోక్, సునీల్‌కుమార్, కిరణ్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్ సురేఖ, ఆశాలత, ఏఈలు లక్ష్మీనారాయణ, మునిశేఖర్, విజయ్, గోపాలకృష్ణ, విజయ్‌కుమార్, లక్ష్మి, దామోదర్, సతీష్, నస్రుల్లా, రమణ, కృష్ణవేణి, చంద్రాచారి, సూర్యగాంధీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈఈ శ్రీధర్